క్లుప్తంగా

భీరప్ప స్వామి ఆలయానికి విరాళం



రూ.25 వేల నగదును అందిస్తున్న ఉమామహేశ్వర్

కర్నూలు(అర్బన్): నగర శివారులోని పెద్దపాడు రోడ్డు ఏపీ ఆదర్శ పాఠశాల సమీపంలో నిర్మిస్తున్న భీరప్ప స్వామి దేవాలయ నిర్మాణానికి కల్లూరుకు చెందిన కే.ఉమామహేశ్వర్ శనివారం రూ.25 వేల నగదును విరాళంగా అందించినట్లు జిల్లా కురువ సంఘం ప్రధాన కార్యదర్శి ఎంకే రంగస్వామి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేవాలయ నిర్మాణంతో పాటు ప్రాంగణంలో కమ్యూనిటీ హాల్, విద్యార్థులకు హాస్టల్ నిర్మాణాలను చేపడుతున్నామన్నారు. దాతలు ముందుకు వచ్చి ఆర్థికంగా సహకారం అందించాలని కోరారు. సంఘం సహాయ కార్యదర్శి బీసీ తిరుపాలు పాల్గొన్నారు.

బాలికపై అత్యాచారానికి పాల్పడిన వారిని శిక్షించాలి

కర్నూలు(సెంట్రల్): శ్రీ సత్యసాయి జిల్లా రామగిరి మండలం ఏడు గుర్రాలపల్లెలో దళిత బాలికపై ఆరు నెలలుగా అత్యాచారానికి పాల్పడుతున్న 14 మందిని కఠినంగా శిక్షించాలని ఐద్వా, డీవైఎఫ్ఐ అధ్యక్ష, కార్యదర్శులు అలివేలు, అరుణ, రాఘవేంద్ర, వై.నగేష్ శనివారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈ ఘటనలో ప్రమేయం ఉన్న 14 మందిపై పోక్సో కేసు నమోదు చేయాలని కోరారు. మొదట ఒక వ్యక్తి బాలికను బెదిరించి అత్యాచారం చేసి మొబైల్‌లో రికార్డు చేసుకొని దానిని తన మిత్రులు 14 మందికి చూపించి ఆమెపై ఆరు నెలలుగా బలవంతం చేస్తూ అత్యాచారానికి పాల్పడ్డారని, ఇది అత్యంత దుర్మార్గమైన చర్య అని, కామాంధులకు ఉరి శిక్ష వేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. నిందితులపై కేసులు పెట్టకుండా అడ్డుకునేందుకు ఎమ్మెల్యే ప్రయత్నించడం సిగ్గుచేటన్నారు. కూటమి ప్రభుత్వ ఉదాసీనత వైఖరితోనే మహిళలు, చిన్నారులపై హత్యలు, అత్యాచారాలు, వేధింపులు పెరిగిపోతున్నాయని, టీడీపీ నాయకులే కామాంధులకు అండగా నిలవడం దారుణమన్నారు.

ఇంటర్ ఫలితాల్లో సత్తా

కర్నూలు (సిటీ): రాష్ట్రవ్యాప్తంగా శనివారం విడుదలైన ఇంటర్మీడియెట్ ఫస్టియర్ సప్లమెంటరీ, ఇంప్రూవ్‌మెంట్ ఫలితాల్లో పలు ప్రైవేటు కళాశాలలకు చెందిన విద్యార్థులు అత్యధిక మార్కులు సాధించినట్లు ఆయా కళాశాలల డీన్‌లు తెలిపారు. శ్రీచైతన్య కళాశాల నుంచి ఎంపీసీలో బి.యశస్విని 467 మార్కులతో సత్తా చాటారని ప్రతి ముగ్గురిలో ఒకరికి 420కిపైగా మార్కులు సాధించారని ఏజీఎం మురళీకృష్ణ వివరించారు. బైపీసీలో బి.జ్యోతిత 436 మార్కులు, ఎస్.సద్దాఫ్ 436, కె.భావన 436 సత్తా చాటగా ప్రతి ముగ్గురిలో ఒకరు 410కి పైగా మార్కులు సాధించినట్లు వెల్లడించారు. నారాయణ కళా శాల నుంచి బైపీసీలో ఎం.సహార 436 మార్కు లు, జి.సరియు 436 మార్కులు, షేక్ బొంతల సనా 436, ఎరమ్ రక్షాన్ 436, షేక్ నషిఫా 436, పోతినేని యాషిత 436 మార్కులు సాధించినట్లు డీజీఎం టి.గోవర్ధన్ రెడ్డి, డీన్‌లు తెలిపారు. ఎంపీసీలో వి.హర్షిత 467 మార్కులు, హఫీజ్ ఎమ్.డి తాసిఫ్ 467, సి.సుగంధిని రెడ్డి 467 మార్కులు, ఎన్.శివ చక్రధర్ 467 మార్కులు సాధించినట్లు వివరించారు.

క్రికెట్ టోర్నీకి క్రీడాకారుల ఎంపిక



క్రీడాకారులను అభినందిస్తున్న అసోసియేషన్ సభ్యులు

ఆదోని అర్బన్: ఆదోని తాలూకా క్రికెట్ అసోసియేషన్ తరపున పట్టణానికి చెందిన అండర్–15లో ఇద్దరు బాలికలు, అండర్–19లో బాలురలు జిల్లా నుంచి జోనల్ అంతర్ జిల్లా క్రికెట్ టోర్నమెంట్‌కు ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం స్థానిక భీమాస్ హోటల్‌లో క్రీడాకారులు అండర్–15 బెస్ట్ బ్యాటర్ జోత్స్న, ఫాస్ట్ బౌలర్ మేఘనారెడ్డి, అండర్–19 నుంచి ఫాస్ట్ బౌలర్లు అక్షయ్, రవితేజను అసోసియేషన్ అధ్యక్షుడు విట్టా రమేష్, ఉపాధ్యక్షుడు ముజీబ్, సెక్రటరీ వెంకటేష్, జాయింట్ సెక్రెటరీ బాషా, కోచ్ బాలాజీ అభినందించారు. విట్టా రమేష్ మాట్లాడుతూ కర్నూలు జిల్లా నుంచి అండర్–15కు ఇద్దరు బాలికలు, జోనల్ అంతర్ జిల్లా క్రికెట్ టోర్నమెంట్‌లో ఎంపికై ఈనెల 9 15వ తేదీ వరకు నెల్లూరులో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. అలాగే.. అండర్–19కు ఇద్దరు ఎంపికైన వారు ఈనెల 10 నుంచి 16వ తేదీ వరకు కడపలో జరిగే పోటీల్లో పాల్గొంటారన్నారు. జోనల్ అంతర్‌జిల్లా పోటీల్లో ప్రతిభ కనబరిస్తే స్టేట్ లెవెల్ పోటీల్లో ఆడతారని తెలిపారు.

ఘనంగా ధ్వజస్తంభ ప్రతిష్ట

కోడుమూరు రూరల్: మండలంలోని బైనదొడ్డి గ్రామంలో వెలసిన శ్రీరాములవారి ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్టను శనివారం గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. గ్రామస్తులంతా శ్రీరాములవారి ఆలయం వద్దకు చేరుకుని స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభ ప్రతిష్ట కార్యక్రమంలో గ్రామ పెద్దలు పులకుర్తి సత్యారెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, అక్కిరెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.





జోహరాపురం రోడ్డు వద్ద ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు, ప్రార్థనలకు హాజరైన మహిళలు



గడ్డా ఈద్గాలో..






పాత ఈద్గాకు ప్రార్థనలకు తరలి వస్తున్న ముస్లింలు, పాత ఈద్గాకు వస్తున్న ముస్లిం చిన్నారులు

ఈద్ ముబారక్

- జిల్లాలో ఘనంగా ఈద్–ఉల్–అజ్ హా
- ఈద్గాల్లో ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు
- సర్వ మానవాళి కోసం దువా చేసిన మత పెద్దలు

కర్నూలు కల్చరల్: ముస్లిం లోకం అత్యంత పవిత్రంగా భావించే ఈద్ ఉల్ అజ్ హా (బక్రీద్) పండుగను శనివారం జిల్లావ్యాప్తంగా ముస్లింలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. ఉదయం 6 గంటల నుంచే శుద్ధి స్నానం చేసి కొత్త బట్టలు వేసుకుని ఈద్ నమాజ్ చదివేందుకు ఈద్గాల వైపు బయలుదేరారు. ×అల్లాహు అక్బర్.. అల్లాహు అక్బర్... లా ఇలాహ్ ఇల్లల్లా... హు అల్లాహు అక్బర్... అల్లాహు అక్బర్ వలిల్లాహిల్ హంద్ అంటూ తక్బీర్ చదువుకుంటూ ఈద్గాలకు చేరుకున్నారు. ఈద్గాలకు వెళ్లలేని వారు సమీపంలోని మసీదులకు వెళ్లి ఈద్ నమాజు చదువుకున్నారు. ఈద్గా, మసీదుల్లో నమాజు చేయించిన ఖాజీలు, మౌల్వీల ఆధ్యాత్మిక ప్రసంగం అనంతరం దువా చేశారు. సర్వ మానవాళి శాంతి కోసం, జీవితంలో చేసిన పాపాల విముక్తి కోసం అల్లాహ్‌ను వేడుకున్నారు. నమాజు, దువా అనంతరం ఒకరినొకరు ఈద్ ముబారక్ చెప్పుకుంటూ కరచాలనం, ఆలింగనం చేసుకుని శుభాకాంక్షలు తెలుపుకున్నారు. నమాజ్‌లో పాల్గొనేందుకు తరలివచ్చిన ముస్లింలతో ఈద్గాలు, మసీదులు కిక్కిరిసిపోయాయి. కొన్ని చోట్ల నమాజుకు స్థలం లేకపోవడంతో రోడ్లపైనే నమాజు చదువుకున్నారు. ఈ సందర్భంగా ముస్లిం, హిందూ అనే తేడా లేకుండా ఒకరినొకరు శుభాకాంక్షలు చెప్పుకోవడం మతసామరస్యానికి ప్రతీకగా నిలిచింది.

- కొత్త బస్టాండ్ సమీపంలోని పాత ఈద్గాలో ప్రభుత్వ ఖాజీ సయ్యద్ సలీంబాష ఖాద్రి, కొత్త ఈద్గాలో మౌలానా మన్సూర్ ఖాసిం, గడ్డలోని అహిలే హదీస్ ఈద్గాలో హఫీజ్ మన్సూర్, జోహరాపురం ఈద్గాలో హసీమ్ జామియా నమాజ్ చేయించారు. బక్రీద్ అంటే ఈద్ ఉల్ అజ్‌హా (త్యాగాల పండుగ) అని ఖాజీలు అన్నారు. ధర్మ ప్రార్థన, ఉపవాసం, జంతుబలి ఇవ్వడం వంటి క్రతువులు ఏదో పుణ్యం కోసం యాంత్రికంగా చేసుకోడానికి నిర్దేశించినవి కావని, వాటిని నిర్వర్తించడం ద్వారా ఉన్నత విలువలతో కూడిన వ్యక్తిత్వాన్ని నిర్మించి మంచి పనులు చేసే ప్రవృత్తిని జనింపచేయటమేనని అన్నారు. అమితంగా ప్రేమించే ధనాన్ని, వస్తువులను ఆహార పదార్థాలను త్యాగం చేయాలన్నారు. ఇతరుల పట్ల ఉండే ఈర్ష్య, అసూయ, ద్వేషాలను బలి ఇవ్వాలన్నారు. నమాజులో ప్రముఖులు పాల్గొన్నారు. పాత ఈద్గాలో వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు, కర్నూలు మాజీ ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ ముస్లింలకు ఈద్ ముబారక్ చెప్పి పండుగ ఫలాలు అందరికీ చేకూరాలని ఆకాంక్షించారు.



పాత ఈద్గాలో ప్రార్థనలు చేయిస్తున్న సయ్యద్ సలీంబాషా ఖాద్రి



పాత ఈద్గాలో ప్రార్థనకు హాజరైన ముస్లింలు



సంతోష్‌నగర్‌లోని ఈద్గాలో ప్రార్థన చేయిస్తున్న ముక్తి సయ్యద్ మన్సూర్ అష్రఫ్



కొత్త ఈద్గాలో ప్రార్థనలకు హాజరైన మాజీ ఐపీఎస్ అధికారి ఇంతియాజ్ అహ్మద్



సంతోష్ నగర్ కొత్త ఈద్గాలో..





కొత్త ఈద్గాలో బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు



పాత ఈద్గాలో ప్రార్థనకు హాజరైన మాజీ ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్

నిరుపేదలపై పన్నుల భారమా?



పేదల ఇంటి పన్ను రసీదులను పరిశీలిస్తున్న పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు

కర్నూలు (టౌన్): రోడ్లు లేవు.. మురుగు కాల్వలు లేవు. మంచం పట్టేంత ఇళ్లు కూడా లేని నిరుపేదలపై ప్రభుత్వం పన్నుల భారం మోపడం దారుణమని పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకుడు ఇరిగినేని పుల్లా రెడ్డి, మాజీ కార్పొరేటర్ ఆవేదన వ్యక్తం చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో శనివారం జిల్లా కోర్టు సమీపంలోని కాలనీలలో వారు పర్యటించారు. పేదలు నివసించే కాలనీల్లో రూ.2 వేల ఇంటి పన్ను చెల్లించాలని రశీదులు ఇస్తే ఎలా కడతారని ప్రశ్నించారు. ఆ కాలనీల్లో బీడీ కార్మికులు, రోజు కూలీ పనులు చేసే వారిపై కరెంట్ చార్జీలు, ఇంటి పన్నుల భారం వేయడం తగదన్నారు. ఇప్పటికీ ఆయా ఏరియాల్లో మౌలిక సదుపాయాలు కల్పించలేదని మండిపడ్డారు. పేద, ధనిక అన్న తేడా లేకుండా పన్నులు వేస్తున్నారని విమర్శించారు. ఆ సంఘం నాయకులు రమణ గౌడ్, క్రిష్ణ, వెంకటేశ్వర్లు, పద్మావతమ్మ తదితరులు పాల్గొన్నారు.

వైభవం.. కూర్మనారాయణ స్వామి జయంత్యుత్సవాలు



ఆస్పరి: మండలంలోని హలిగేరి సమీపంలోని గుహలో వెలసిన శ్రీ స్వయంభూ కూర్మనారాయణ స్వామి జయంత్యుత్సవాలు శనివారం వైభవంగా నిర్వహించారు. ఆలయ నిర్వాహకుడు నరేష్ ఆధ్వర్యంలో ఆలయంలో స్వామి వారికి క్షీర, చందనాభిషేకం, నదీ జలాలతో అభిషేకం, శ్రీలక్ష్మీ అష్టోత్తర సహిత, శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, రావిచెట్టుకు పూజలు, హనుమప్ప స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులు స్వామి వారి చిత్ర పటంతో గిరి ప్రదక్షిణ, పుట్టలకు పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు పీఠాధిపతులకు గ్రామస్తులు, ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. గంగావతికి చెందిన మహిళా భక్తుల కోలాటం ఆకట్టుకుంది. దూర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో వచ్చిన భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు.

పీఠాధిపతుల ప్రత్యేక పూజలు..

జయంత్యుత్సవాలకు విద్యాభినవ సుబ్రహ్మణ్య భారతి మహాస్వామి, అవ్యక్తానంద సరస్వతి, శివయోగేంద్ర సరస్వతి స్వామి, జగద్గురు శంకరాచార్య శ్రీవిద్యానృసింహ భారతిస్వామి, పాండు రంగానంద భారతి స్వామి, రుక్మిణీమాత, శివానంద చైతన్య స్వామి, గురు సుబ్రహ్మణ్యం, స్వామి శంకరానందగిరి, సురేంద్ర మహారాజ్, అనంతానంద భారతి స్వామి, రామాంజనేయులు గురుస్వామి, మాడగుల అనిల్‌కుమార్ శర్మ, రామిరెడ్డిగారి అరుణారెడ్డి తదితర పీఠాధిపతులు పాల్గొని ప్రత్యేక పూజలు చేసి స్వామిని దర్శించుకున్నారు.

అనాథ శవానికి అంత్యక్రియలు

కర్నూలు (టౌన్): అనాథ శవానికి అంత్యక్రియలు చేసేందుకు ఎవరూ ముందుకు రాకపోవడంతో వేదాస్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు, యహ్యా కర్నూలు సేవా సమితి సభ్యులు నౌషాద్ ముందుకు వచ్చి అంత్యక్రియలు జరిపించారు. వివరాలు.. స్థానిక రైల్వే స్టేషన్ సమీపంలోని పట్టణ నిరాశ్రయుల వసతి గృహంలో గత నాలుగేళ్లుగా వెంకటేశ్వరరావు (65) అనే అనాథ వృద్ధుడు ఆశ్రయం పొందుతున్నాడు. పెరాలసిస్‌తో వ్యాధితో ఇబ్బంది పడుతున్నారు. వారం రోజులుగా ఆయాసంతో బాధపడుతూ శనివారం మృతి చెందాడు. ఆయనకు అంత్యక్రియలు చేసేందుకు వేదాస్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు సునీల్‌కుమార్, యహ్యా సంస్థ సభ్యులు నౌషాద్ ముందుకు వచ్చారు. మృతదేహానికి అన్ని తంతులు నిర్వహించి వాహనంలో పాతబస్తీలోని జమ్మిచెట్టు వద్ద ఉన్న హిందూ శ్మశాన వాటికకు తరలించి సంప్రదాయం ప్రకారం ఖననం చేశారు. వసతి గృహం సభ్యులు సందీప్‌కుమార్, ప్రభాకర్, కరుణమ్మ, ఇమ్రాన్ హోటల్ యజమాని వాహీద్ పాల్గొన్నారు.

రైలు కింద పడి మహిళ మృతి

ఆదోని సెంట్రల్: కౌతాళం మండలం బదినేహాల్ గ్రామానికి చెందిన హరిజన చిట్టెమ్మ(38) అనే మహిళ శనివారం ఉదయం 9;45 గంటల సమయంలో గూడ్స్ రైలు కింద మృతి చెందినట్లు ఆర్‌పీహెచ్‌సీ సాయి సర్వేశ్వరరావు తెలిపారు. వివరాలు.. మృతురాలికి వివాహమై 15 ఏళ్లు అయినా పిల్లలు కలగకపోవడం, గతంలో భర్త హరిజన చిన్న వెంకటేష్‌కు యాక్సిడెంట్ కావడం.. దీంతో జీవితంపై విరక్తి చెంది రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిసిందన్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

హామీలను విస్మరించడంపై ఆగ్రహం

- నేడు డీఈఓ కార్యాలయ ముట్టడికి ఉపాధ్యాయ సంఘాల పిలుపు



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయ ఐక్య వేదిక నాయకులు

కర్నూలు సిటీ: పాఠశాల విద్యాశాఖ అధికారులు గత నెలలో ఉపాధ్యాయ సంఘాలతో జరిపిన చర్చల్లో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని ఉపాధ్యాయుల ఐక్యవేదిక నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం ఇందిరా గాంధీ మెమోరియల్ మున్సిపల్ హైస్కూల్‌లోని కౌన్సెలింగ్ కేంద్రం వద్ద ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆ ఐక్య వేదిక నాయకులు మాట్లాడుతూ.. గత నెలలో ఉపాధ్యాయ సంఘాలతో పాఠశాల డైరెక్టర్, విద్యాశాఖ కార్యదర్శి నిర్వహించిన చర్చల్లో ఎస్‌జీటీలకు మాన్యువల్‌గా కౌన్సెలింగ్ నిర్వహిస్తామని మాటిచ్చారని, అయితే మాటను నిలబెట్టుకోవడంలో విద్యాశాఖ విఫలమైందన్నారు. వెబ్ కౌన్సిలింగ్‌లో అనేక సాంకేతిక సమస్యలు వస్తాయన్నారు. మాన్యువల్‌గా కౌన్సెలింగ్ నిర్వహించాలని కోరుతూ జిల్లా కేంద్రంలో ఉపాధ్యాయ సంఘాల వేదిక ఆధ్వర్యంలో ఆదివారం డీఈఓ కార్యాలయ ముట్టడి కార్యక్రమం చేపట్టామని, ఉమ్మడి జిల్లాలోని ఉపాధ్యాయులందరూ వచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం డీఈఓ కార్యాలయానికి వెళ్లి డీఈఓ ఎస్.శామ్యూల్ పాల్‌కు నిరసన నోటీసు అందజేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక పాఠశాలల టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ప్రకాష్ రావు, ఏపీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సత్యనారాయణ, వైఎస్ఆర్‌సీపీ టీచర్స్ అసోసియేషన్ నాయకులు ప్రతాప్‌రెడ్డి, యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఉల్చాల రవికుమార్, నవీన్ పాటి, ఉపాధ్యాయ సంఘాల నాయకులు మాధవస్వామి, మరియానందం, రంగన్న, గోకారి, జనార్దన్, కృష్ణారెడ్డి, నాగిరెడ్డి, వెంకటేశ్వర్లు, మధుసూదన్ రెడ్డి, ఆర్.సేవలాల్ నాయక్, రాజాసాగర్, హుసేన్, లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

వసతి గదుల నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్‌రెడ్డి

కోడుమూరు రూరల్: మండలంలోని వెంకటగిరిలో వెలసిన గిడ్డాంజనేయస్వామి దర్శనార్థం వచ్చే భక్తుల వసతి కోసం నిర్మించ తలపెట్టిన వసతి గదుల నిర్మాణ పనులకు కుడా మాజీ చైర్మన్ కోట్ల హర్షవర్ధన్ రెడ్డి శనివారం భూమి పూజ నిర్వహించారు. గ్రామానికి విచ్చేసిన కోట్ల హర్షవర్ధన్‌రెడ్డికి గ్రామ వైఎస్సార్ సీపీ నాయకులు కాంట్రాక్టర్ వేణుగోపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు, స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు మేళతాళాలతో ఘనంగా స్వాగతం పలికారు. కోట్ల హర్ష ముందుగా గిడ్డాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, గ్రామపెద్దలు వేణుగోపాల్‌రెడ్డి, వెంకటశివుడు, వెంకటేశ్వరరెడ్డి, పాల గిడ్డయ్య, గిరిబాబు, రామ గిడ్డయ్య, వెంకటేశ్వర్లు, డీలర్ రాముడు పాల్గొన్నారు.

రద్దు చేసిన రైళ్లను పునరుద్ధరించాలి




సంతకాల సేకరణ చేపట్టిన సీపీఐ నాయకులు

కర్నూలు(సెంట్రల్): కరోనా సమయంలో రద్దు చేసిన రైళ్లను పునరుద్ధరించాలని సీపీఐ జిల్లా కమిటీ సభ్యుడు కె.చంద్రశేఖర్, నగర కమిటీ సహాయ కార్యదర్శి దంబోళం శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం సీపీఐ ఆధ్వర్యంలో గుత్తి పెట్రోల్ బంకు సమీపంలో సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ.. కర్నూలు నుంచి విజయవాడకు ఎక్స్‌ప్రెస్ రైలును నడపాలని డిమాండ్ చేశారు. అలాగే తిరుపతి నుంచి కర్నూలు, కర్నూలు నుంచి తిరుపతికి ఇంటర్ సిటీ రైలును నడపాలన్నారు. గతంలో కరోనా సమయంలో రద్దైన ప్యాసింజర్ రైళ్లను తిరిగి అదే సమయానికి నడపాలని కోరారు. కర్నూలు నుంచి చాలా మంది విద్యార్థులు, సామాన్య, మధ్యతరగతి ప్రజలు గుంటూరు, విజయవాడకు వెళ్తుంటారని, వారికి అనువైన సమయాల్లో రైళ్లను నడపాలని, అలాగే డోన్ నుంచి ముంబై వరకు నేరుగా రైలును నడపాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గిడ్డయ్య ఆచారి, మహేష్, బాబు, ప్రసాదు, మహేష్, రామాంజనేయులు, బి.రాముడు పాల్గొన్నారు.

మెదడులో కల్లోలం

- పెరుగుతున్న బ్రెయిన్ ట్యూమర్ బాధితులు
- ఆధునిక పద్ధతిలో ట్యూమర్ల తొలగింపు
- నేడు వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్ డే



బ్రెయిన్‌లో ట్యూమర్ చిత్రం

కర్నూలు(హాస్పిటల్): బ్రెయిన్ ట్యూమర్ ఇప్పుడు పట్టణాల నుంచి పల్లెల దాకా అందరికీ తెలిసిన పదం. ఎందుకంటే చాలా మందిలో ఈ వ్యాధి వస్తోంది కాబట్టి. ధూమపానం చేయడం, రేడియేషన్ ప్రభావానికి గురికావడం, మొబైల్ ఎక్కువగా వాడే వారిలో ఈ సమస్య వచ్చే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. వ్యాధి లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స చేయించుకుంటే ప్రమాదం నుంచి బయటపడవచ్చు. మెదడులో కణితులపై అవగాహన కల్పించేందుకు ప్రపంచ ఆరోగ్య సంస్థ ఏటా జూన్ 8న వరల్డ్ బ్రెయిన్ ట్యూమర్ డే నిర్వహిస్తోంది.

జిల్లాలో మెదడులో కణితులు (బ్రెయిన్ ట్యూమర్లు) ఉన్న వారి సంఖ్య అధికమవుతోంది. గతంలో ఇలాంటి సమస్యల చికిత్సకు హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాలకు వెళ్లేవారు. ఇప్పుడు కర్నూలులోనే చికిత్స చేస్తున్నారు. ఈ సమస్యతో ప్రతి లక్ష మందిలో పది మంది బాధపడుతున్నట్లు వైద్యుల గణాంకాలు చెబుతున్నాయి. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని న్యూరో సర్జరీ విభాగంలో నిర్వహించే ఓపీకి మెదడు, వెన్నుపూసకు సంబంధించి సమస్యలతో 250 నుంచి 300 మంది దాకా రోగులు చికిత్స కోసం వస్తారు. ఇందులో 10 నుంచి 15 మంది బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న వారున్నారు. నెలకు 10 నుంచి 15 మందికి ఆపరేషన్ చేస్తున్నారు. ఈ మేరకు గత ప్రభుత్వం అందించిన అడ్వాన్స్‌డ్ మైక్రోస్కోప్‌లు ఎంతో ఉపయోగపడుతున్నాయి. ఆపరేషన్లన్నీ ఎన్‌టీఆర్ వైద్యసేవ పథకంలో ఉచితంగా నిర్వహిస్తున్నారు. దీంతో పాటు నగరంలోని ప్రైవేటు ఆసుపత్రుల్లో వైద్యుల వద్దకు రోజుకు 20 నుంచి 30 మంది దాకా చికిత్స కోసం వస్తున్నారు.

బ్రెయిన్ ట్యూమర్ లక్షణాలు

బ్రెయిన్ ట్యూమర్ విధం, పరిమాణం, స్థానం, పెరిగే వేగం వ్యక్తుల వారీగా మారుతూ ఉంటాయి. లక్షణాలను గుర్తించడం కొంత కష్టం కావొచ్చు. ఇందులో ముఖ్యంగా తలనొప్పి, తలలో ఒత్తిడి అనిపించడం, ఉదయాన్నే ఎక్కువగా తలనొప్పి రావడం, పడుకున్నప్పుడు తలనొప్పి పెరగడం, వికారం, వాంతులు, డబుల్ విజన్ (ఒక వస్తువు రెండుగా కనిపించడం) వంటి లక్షణాలు కనిపిస్తాయి. కొంత మందిలో ట్యూమర్ స్థానం ఆధారంగా మరికొన్ని లక్షణాలు కనిపిస్తాయి. అందులో కుదుపులు, చూపులో సమస్యలు, మాట్లాడటంలో ఇబ్బంది, నడవడంలో కష్టం, ముఖం ఒకవైపు వంగిపోవడం, ప్రవర్తనలో మార్పులు, జ్ఞాపకశక్తి లోపాలు ఉంటాయి.

బ్రెయిన్ ట్యూమర్ రకాలు

మెదడులోని కణజాలంలో ఏర్పడే ముద్దను వైద్యులు బ్రెయిన్ ట్యూమర్‌గా గుర్తిస్తారు. ఇందులో ప్రైమరీ బ్రెయిన్ ట్యూమర్, సెకండరీ బ్రెయిన్ ట్యూమర్. ప్రైమరీ బ్రెయిన్ ట్యూమర్ నాలుగు విభాగాలుగా ఉంటుంది. సెకండరీ బ్రెయిన్ ట్యూమర్‌లు శరీరంలో వివిధ భాగాల్లో సోకుతాయి. అవి రక్తంలో ప్రవేశించి మెదడుకు చేరతాయి. దీని ద్వారా మెదడులో కణితులు ఏర్పడతాయి. కొన్ని రసాయనాల బారిన పడటం, రేడియేషన్ ఎక్కువగా ఉండటం, ఎక్స్‌టీమ్ వైరస్ బారిన పడటం వల్ల ఈ ట్యూమర్లు ఏర్పడతాయి.

కారణాలు, వ్యాధినిర్ధారణ

సాధారణంగా మానవుడి మెదడులో ట్యూమర్లు జన్యుపర లోపాల వల్ల, వంశపారంపర్యంగా వస్తాయి. మెదడుకు రేడియేషన్ సోకడం వల్ల కూడా ఈ సమస్య ఉత్పన్నమవుతుంది. సెల్‌ఫోన్ విపరీతంగా వాడటం వల్ల రేడియేషన్ సోకి మెదడులో గడ్డలు ఏర్పడే అవకాశం ఉంది. ప్రస్తుతం చిన్నా పెద్దా అనే తేడా లేకుండా అన్ని వయస్సుల వారికీ ఈ సమస్య వస్తోంది. బ్రెయిన్ ట్యూమర్‌ను క్లినికల్, రేడియాలజీ, సర్జికల్ విధానాల్లో నిర్ధారిస్తారు. సీటీ స్కాన్, ఎంఆర్ఐ స్కాన్ పరీక్షల ద్వారా ఇది నిర్ధారణ అవుతుంది. కొందరిలో మాత్రమే ఆపరేషన్ ద్వారా నిర్ధారణ అవుతుంది. నిర్ధారణ అనంతరం మాత్రమే వైద్యులు చికిత్స ప్రారంభిస్తారు.

ప్రమాద స్థితిని పెంచే బ్రెయిన్ ట్యూమర్లు



దీర్ఘకాలంగా కిరణ వికరణ (రేడియేషన్)కు గురయ్యే వ్యక్తులు, ధూమపానం చేసే వారు బ్రెయిన్ ట్యూమర్‌కు గురయ్యే అవకాశాలు ఉంటాయి. బ్రెయిన్ ట్యూమర్లు చాలా ప్రమాదకరమైనవి. వీటిని సకాలంలో గుర్తించి చికిత్స చేయకపోతే ప్రాణాపాయం కలగవచ్చు. ఏ మాత్రం అనుమానం ఉన్నా ఆలస్యం చేయకుండా వెంటనే వైద్యులను సంప్రదించాలి. ఆలస్యం ప్రాణాలకు హానికరం కావచ్చు.

– డాక్టర్ కేఎస్.విశ్వకుమార్, న్యూరోసర్జన్, కర్నూలు

ట్యూమర్లను నిర్లక్ష్యం చేయరాదు



బ్రెయిన్ ట్యూమర్లను నిర్లక్ష్యం చేయరాదు. లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను కలిసి చికిత్స తీసుకోవాలి. లక్షణాలను బట్టి స్కానింగ్ చేసి కణితి ఉందా లేదా అని వైద్యులు నిర్ధారిస్తారు. వైద్యపరీక్షల్లో మెనింజియోమా అనే చిన్న కణితి ఉంటే మాత్రం దానికి సర్జరీ అవసరం ఉండదు. అది మెదడులో ఉన్నా ఏమీ చేయదు. ఇది క్యాన్సర్ కణితిగా మారే అవకాశం లేదు. ఆడవారిలో పిట్యూటరీ గ్రంథి వద్ద ఏర్పడే మాక్రో అడినోమా అనే కణితి వల్ల కంటి చూపు సమస్య వచ్చే ప్రమాదం ఉంది.

– డాక్టర్ కె.హేమంత్‌కుమార్, న్యూరాలజిస్టు, కర్నూలు

కనులపండువగా చెన్నకేశవస్వామి కల్యాణం

వెల్దుర్తి: మండలంలోని ఎస్ పేరేముల గ్రామంలో శనివారం శ్రీలక్ష్మీ, భూదేవి సమేత చెన్నకేశవస్వామి కల్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. గ్రామస్తుల ఆధ్వర్యంలో రమణమ్మ, బొంతల రామకృష్ణారెడ్డి దంపతులు, కుటుంబ సభ్యులు ఉభయదాతలుగా వ్యవహరించిన వేడుకకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి మహోత్సవాన్ని తిలకించారు.